

ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహ మెహ్రా

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

పూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పోలీసులు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. అలాగే మహిళలు, బాలికలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. ఆమె గురువారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అలాగే నమోదైన కేసుల సంఖ్య, కేసుల పురోగతిపై ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు దొంగతనాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధుల్లో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన

కొడంగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ చంద్రకిరణ్ అన్నారు. గురువారం కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావు ఉండొద్దన్నారు. అభ్యర్థులు ఖర్చుల వివరాలను సమర్పించని పక్షంలో గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని అభ్యర్థులకు స్పష్టంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, సూపరింటెండెంట్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

పోలింగ్ స్టేషన్ ప్రకారం ఓటరు జాబితా పొందుపర్చాలి

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితాను పోలింగ్‌స్టేషన్ ప్రకారం సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి ఈఆర్‌వోలను ఆదేశించారు. అలాగే వెబ్‌సైట్‌లోని పోలింగ్‌స్టేషన్ డేటాను పీడీఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ చేసి, దానిని ఎక్సెల్ ఫార్మాట్‌కు మార్చాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో సెర్చ్ ఆప్షన్ ద్వారా హౌజ్ నంబరు, పేరు, ఎపిక్ నంబరు ద్వారా సెర్చ్ చేసే ఆప్షన్ కూడా ప్రారంభించినట్లు తెలియజేశారు. 2002 మ్యాపింగ్ డేటాను వంద శాతం సెర్చింగ్‌తో పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన అదనపు సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో ఉపేందర్‌రెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్ మతిన్, ఈఆర్‌వోలు పాల్గొన్నారు.

శరవేగంగా మున్సిపాలిటీల విలీన ప్రక్రియ

» డిసెంబరు 31లోగా పూర్తికి కసరత్తు

మేడ్చల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ నగర శివారు ఓఆర్ఆర్ లోపల, సమీప మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. డిసెంబరు 31లోగా 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే మంత్రి వర్గం ఆమోదం తెలిపిన విషయం విదితమే. తాజాగా జీహెచ్ఎంసీ పాలకమండల కూడా ఆమోదించింది. దీంతో విలీనం పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. 2026 జనవరి 1వ తేదీ నుంచి జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానున్నందున అంతకుముందే విలీన ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో అధికారులున్నారు. జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభమైతే కొత్త చిక్కులు వచ్చే అవకాశమున్నందున ఆ లోపే విలీన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో దుండిగల్, కొంపల్లి, మేడ్చల్, గుండ్లపోంపల్లి మున్సిపాల్టీలు, అల్వాల్ సర్కిల్‌లోకి తూంకుంట మున్సిపాలిటీ, జవహర్‌నగర్ కార్పొరేషన్, ఉప్పల్ పరిధిలోకి పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాల్టీలను విలీనం చేసి ఓ సర్కిల్‌గా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

తొలివిడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పక్రియ మొదలు కావడంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ పల్లెల్లో పట్టుకోసం ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఎన్నికల్లో పట్టుసాధిస్తే తర్వాత జరిగే పరిషత్ ఎన్నికల్లో సులువుగా విజయం సాధించొచ్చని నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రతీ గ్రామంలోని ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు.



పల్లెల్లో పట్టెవరిది?

ప్రధాన పార్టీలకు సవాల్‌గా పంచాయతీ ఎన్నికలు

- మద్దతుదారులను గెలిపించుకునేందుకు పోటాపోటీ
- ఇక్కడ పట్టుసాధించి పరిషత్ ఎన్నికల్లో సత్తాచాటేలా వ్యూహాలు
- పలు చోట్ల ఏకాభిప్రాయానికి అధికార పార్టీ యత్నాలు



వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమైన ఆశావహులు ఇప్పటికే తమ అనుచరులతో కలిసి గడప గడపకు తిరుగుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక, ఆర్థిక అంశాలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. డబ్బులు, తాయిలాలు ప్రధానాస్త్రాలుగా మారి అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో అంగబలం, అర్థబలం ఉన్న నేతలను ఆయా పార్టీలు బరిలో దింపేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారు వ్యూహరచన చేస్తున్నారు. పార్టీలను పక్కనబెట్టి ప్రజల్లో మంచి పట్టున్న నాయకుల గురించి వాకబు చేస్తున్నారు. గతంలో గ్రామానికి చేసిన సేవలు, నిర్వహించిన బాధ్యతల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తే గెలుపొందే అవకాశాలు ఉంటాయనేది విషయమై వారు ముఖ్య నేతలతో ఆరా తీస్తున్నారు.

అధికార పార్టీలో ధీమా

పంచాయతీ ఎన్నికల్లో తమ మద్దతుతారులందరూ విజయం సాధిస్తారన్న ధీమాతో అధికార కాంగ్రెస్ పార్టీ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే

మిగతా 8వ పేజీలో...

పట్టు బిగించేలా బీఆర్ఎస్ వ్యూహం

మెజార్టీ స్థానాలే లక్ష్యంగా బీఆర్ఎస్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఎన్నికల్లో తాము మద్దతిచ్చే అభ్యర్థులను గెలిపించుకోవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తమకు అనుకూలంగా మారుతుందని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో బలమైన అభ్యర్థులనే బరిలోకి దించే విధంగా మాజీ ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. సర్పంచులుగా తమ మద్దతుదారులు గెలిస్తే రాబోయే ఎన్నికల్లో వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఉంటుందని వారు భావిస్తున్నారు. ప్రజా సమస్యలు, అమలుకు నోచుకోని కాంగ్రెస్ హామీలను ప్రజల్లో ఎండగట్టి తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

బషీరాబాద్‌షాలు

సర్పంచ్ నుంచి శాసనసభ్యుడి వరకు ఇద్దరన్నదమ్ములది ప్రత్యేక రాజకీయ ప్రస్థానం

7

ఏకతాటిపైకి పంచాయతీలు!

ఏకగ్రీవబాటలో దుగ్గాపూర్, ఆత్కూర్ గ్రామాలు

తొలిరోజు అంతంతే..

సర్పంచ్ స్థానాలకు 162, వార్డులకు 87 నామినేషన్లు

ప్రారంభమైన పంచాయతీ తొలి ఘట్టం.. కిటకిటలాడిన ప్రభుత్వ కార్యాలయాలు



తాండూరు రూరల్: నామినేషన్ దాఖలు చేస్తున్న చెంగేశ్‌పూర్ సర్పంచ్ అభ్యర్థి

వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొలి విడత పంచాయతీ సంగ్రామం ప్రారంభమైంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రిటర్నింగ్ అధికారులు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. క్లస్టర్ కేంద్రాల పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్, వార్డు పదవులకు వారు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. జిల్లాలో తొలి విడత ఎన్నికలు జరగనున్న తాండూరు, కొడంగల్ నియోజక వర్గాల పరిధిలో ఎనిమిది మండలాల్లోని పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభమైంది. ఎన్నికలు నిర్వహిస్తున్న 262 పంచాయతీల్లో నామినేషన్ల తొలిరోజు సర్పంచ్ పదవులకు 162 నామినేషన్లు రాగా, 2,198 వార్డులకు 87 నామినేషన్లు వచ్చాయి. కాగా, అభ్యర్థులు, మద్దతుదారులతో నామినేషన్లు దాఖలు చేసే క్లస్టర్ కార్యాలయాలు కిటకిటలాడాయి.

బషీరాబాద్‌లో అధికంగా..

తాండూరు మండలంలో 33 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 24 నామినేషన్లు రాగా, 290 వార్డులకుగాను 11 నామినేషన్లు వచ్చాయి. బషీరాబాద్ మండలంలో 39 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 25 నామినేషన్లు రాగా, 312 వార్డు పదవులకు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. యాలాల్ మండలంలో 39 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 29 నామినేషన్లు, 318 వార్డు పదవులకు 15 నామినేషన్లు వచ్చాయి. పెద్దేముల్ మండలంలో 38 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 27 నామినేషన్లు, 308 వార్డు పదవులకు 25 నామినేషన్లు దాఖలయ్యాయి. కొడంగల్ మండలంలో 25 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 18 నామినేషన్లు, 222 వార్డు పదవులకు కేవలం 13 నామినేషన్లు వచ్చాయి. దౌల్తాబాద్ మండలంలో 33 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 22 నామినేషన్లు, 290 వార్డు పదవులకు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. బొంరాస్‌పేట్ మండలంలో 35 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 7 నామినేషన్లు, 292 వార్డు పదవులకు ఒక నామినేషన్ మాత్రమే వచ్చాయి. దుద్యాల్ మండలంలో 20 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 10 నామినేషన్లు రాగా, 166 వార్డు సభ్యుల పదవులకు 2 నామినేషన్లు వచ్చాయి.

ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా.. కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమీక్ష



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న యాస్మిన్ బాషా, కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/బొంరాస్‌పేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీలతో కలిసి ఆమె నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్వోలు, ఏఆర్‌ఓలు, ఏవోలు, ఏపీవోలు, జోనల్ అధికారులు, సూక్ష్మ పరిశీలనకు మరోసారి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, రోజు వారీ ఎంసీసీ నివేదికలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలు, మీడియా సర్టిఫికేషన్ , సోషల్ మీడియా పర్యవేక్షణ తదితర అంశాలన్నింటినీ జాగ్రత్తగా చూడాలన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు 912, అత్యంత సమస్యాత్మకమైనవి 922 గుర్తించామని

మిగతా 8వ పేజీలో...

ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలి

» మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కీసర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర, చీర్యాలలో గురువారం శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ కొండ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

రాకంచర్లలో భూకంపం వదంతులు

పూడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాకంచర్లలో గురువారం మధ్యాహ్నం స్వల్పంగా భూమి కంపించిందనే వార్త వైరలైంది. రెండు నిమిషాల పాటు భూమి కంపించిందని, ఏం జరిగిందో తెలుసుకునేలోపే కంపనాలు ఆగాయని గ్రామస్తులు చెప్పారు. స్వల్ప భూకంపంతో ఆందోళనకు గురయ్యామని తెలిపారు. గత ఆగస్టు 14న పరిగి మండలం బసిరెడ్డిపల్లి, సమీప గ్రామాల్లో స్వల్పంగా భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. దీంతో మళ్లీ ప్రకంపనాలొచ్చాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గురువారం రాత్రి పూడూరు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భూ విపత్తు శాఖ అధికారులతో కూడా సంప్రదించి తెలుసుకున్నామని, రాకంచర్లలో భూకంపం రాలేదని తహసీల్దార్ నిర్ధారించారు. గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

బీసీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వం విఫలం

» బీసీ జేఏసీ నేతల ఆరోపణ




మీడియాతో మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీసీ జేఏసీ నాయకులు ఆరోపించారు. గురువారం వారు వికారాబాద్ క్లబ్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ చేతల్లో చూపించలేకపోయిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన కల్పనపై ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్‌కు, కేంద్ర ప్రభుత్వానికి పంపించినా సాధించే దిశగా ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేస్తున్నామంటూనే అన్యాయం చేస్తున్నారన్నారు. వికారాబాద్ జిల్లా జనాభాలో 60 శాతం బీసీలు ఉంటే, సర్పంచ్ పదవుల్లో 18 శాతం మాత్రమే కేటాయించారని ఆరోపించారు. జిల్లాలో మరో 100 పంచాయతీల్లో సర్పంచులుగా ఎన్నికయ్యే అవకాశం ప్రభుత్వ వైఖరి కారణంగా బీసీలు కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

30ఏళ్లు పైబడిన వారందరికీ స్క్రీనింగ్

» జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి



మాట్లాడుతున్న స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్ల పైబడిన వారందరికీ స్క్రీనింగ్ నిర్వహించి వారికి ఉండే జీవన శైలి వ్యాధులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న క్షేత్రస్థాయి పర్యవేక్షక సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలో సమావేశాలు నిర్వహించినప్పుడు మలేరియా, క్షయ, కుష్ఠు వ్యాధులను గుర్తించడం గురించి ఆశాలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే నవజాత శిశు సంరక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పవిత్ర, డాక్టర్ నిరోషా, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, మహేశ్ కుమార్, డీడీఎం శ్రీనివాసులు, అమీర్, పీహెచ్‌సీల క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


పరిగిలో సమావేశమైన భాషా పండితులు

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం పరిగిలో నిర్వహించిన భాషా పండితల సమావేశానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి ఏజాజ్అహ్మద్‌తో కలిసి హాజరై మాట్లాడారు. 1/2005 చట్టాన్ని రద్దు చేయాలని, భాషా పండితులుగా చేసిన కాలానికి నోషనల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. 190 జీవో సవరించి భాషా ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ అవకాశం కల్పించాలని కోరారు. ఇతర సబ్జెక్టుల మాదిరిగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో భాషా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. పండితుల డిమాండ్ల సాధనకు సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు కృష్ణయ్య, మహేందర్, పారూఖ్‌పటేల్, వెంకటయ్య, నయీమొద్దీన్, రవి కుమార్, జి.మంజుల, బాలమణి, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పండిత పరిషత్ మండలాల కార్యవర్గాల ఎన్నిక

పండిత పరిషత్ కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి మండల కార్యవర్గ అధ్యక్షుడిగా ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శిగా వీరానందంచారి, కోశాధికారి అనిత, మహిళా ప్రతినిధులుగా అనంతలక్ష్మి, బీబీ ఎన్నికయ్యారు. పూడూరు మండల అధ్యక్షుడిగా ఉమర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా టి.మౌనిక, కోశాధికారిగా షఫీ ఎన్నికయ్యారు. అలాగే కులకచర్ల మండల అధ్యక్షుడిగా పల్లె శీనయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రసాద్, కోశాధికారి జి.యాదగిరి, మహిళా ప్రతినిధిగా గంగా, దోమ మండల అధ్యక్షుడిగా బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నరసింహ, కోశాధికారిగా వెంకటాచారి, మహిళా ప్రతినిధిగా శాంతి, చౌడపూర్ మండల అధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా బసయ్య, మహిళా ప్రతినిధిగా బి.రమాదేవి ఎన్నికయ్యారు.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్ గురువారం ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం జిల్లాలో 594 సర్పంచులకు 107 స్థానాలు కేటాయించి 18 శాతంతో సరిపెట్టిందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత తక్కువ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

పక్కాగా నామినేషన్ల ప్రక్రియ

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం మండలంలోని పలు నామినేషన్ల కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాశీంపూర్, గొట్టిగకలాన్ తదితర నామినేషన్ కేంద్రాల్లో అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.


కూరగాయల దుకాణాన్ని ప్రారంభిస్తున్న గోపాల్‌నాయక్

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యం

బొంరాస్‌పేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాసన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల దుకాణాన్ని అరక ఎఫ్‌పీసీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించే కూరగాయలు, సిరి ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గోపాల్, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదన చారి

మోకిల తండాలో రెస్టారెంట్ ప్రారంభం

శంకర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకిల తండాలో లివి కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుమారుడు ప్రశాంత్‌కు చెందిన లివి కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను గురువారం మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారితో కలిసి ప్రారంభించి ప్రశాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజునాయక్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు లింగం ముదిరాజ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు రవినాయక్, ఫరీద్, భూపాల్, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌కు సన్మానం


ధారాసింగ్‌ను సన్మానిస్తున్న శివరాంనాయక్

చౌడాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌ను ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ధారాసింగ్‌ను పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ధారాసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్, చౌడాపూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, పరిగి అధ్యక్షుడు తావుర్యానాయక్, మాజీ ఎంపీపీ సత్యహరిచంద్ర, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రామ్‌లాల్‌నాయక్, నాయకులు విఠల్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా శాంతియుతంగా జరిగేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని 210 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ముచ్చర్ల గేటు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ప్రారంభించారు. ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. అన్నీ పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, గ్రామాల్లో గతంలో అల్లర్లకు కారణమైన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సరైన ఆధారాలు చూపాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ వైరు తగిలి వరిగడ్డి దగ్ధం



కొత్తూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడిచర్ల శివారులో ఎస్‌బీపల్లి రోడ్డులో విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధం కాగా, లారీ పాక్షికంగా మంటల్లో చిక్కుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్వరం మండలం నాగారం సమీపంలోని ఏనుగుచెరువుతండాకు చెందిన రైతు శంకర్ కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో వరి గడ్డిని కొనుగోలు చేశాడు. గురువారం గడ్డిని లారీలో తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డిలో మంటలు చెలరేగాయాయి. లారీ మంటల్లో చిక్కుకోగా గమనించిన రైతు శంకర్, డ్రైవర్ సందీప్ లారీలో గడ్డిని కిందకు నెట్టి వేశారు. అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. గంట వరకు అగ్నిమాపక యంత్రం రాకపోవడంతో బాధితులు విస్మయం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

పిల్లల్లో ఇంగ్లిష్‌పై ఆసక్తిని పెంపొందించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంగ్లిష్‌పై అభిరుచిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. పరిగిలోని జెడ్పీహెచ్‌ఎస్ నం.1 పాఠశాలలో గురువారం ఇంగ్లిష్ లాంగ్వేజ్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ఒలంపియాడ్ ఎడ్యుకేషన్ టాక్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్‌యాదవ్, కె.వెంకటయ్య, డి.హన్మంత్, భారతి, శిల్పశ్రీ, స్రవంతి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురు పిల్లల నిబంధన' ఎత్తివేత

కులకచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గతంలో ఉన్న ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసిందని మండల పంచాయతీ ఎన్నికల అధికారి, ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన ఉండేదన్నారు. మండలంలో డిసెంబరు 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 33 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేంద్రాల వారీగా పుట్టపహాడ్, అనంతసాగర్, సాల్విడ్, ఘనపూర్, దీప్లనాయక్ తండా, చెల్లాపూర్, హన్యానాయక్ తండా, బండవెల్కిచర్ల, రాంనగర్, ఎర్రగోవింద్ తండా, బొంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, దాస్యనాయక్ తండా, రాంరెడ్డిపల్లి, అల్లాపూర్, తిరుమలాపూర్, లాల్‌సింగ్ తండా, బండమీది తండా, ఇప్పాయిపల్లి, కులకచర్ల, చాపలగూడెం, ఎత్తుకాల్వ తండా, చెరువు ముందలి తండా (ఏ), కుసుమసముద్రం, చెరువు ముందలి తండా (కే), గోరిగడ్డ తండా, రాంపూర్, కామునిపల్లి, పీరంపల్లి, బోత్యనాయక్ తండా, పటేల్ చెరువు తండాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు వివరించారు.


విద్యార్థులతో ఎంఈవో లక్ష్మణ్ నాయక్, సంస్థ ప్రతినిధులు

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

షాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని ఎంఈవో లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలో వెంకమ్మగూడ స్కూల్‌లో స్ట్రీట్‌కాస్ వీజేబీటీ తరఫున విద్యార్థులకు వ్యాకరణ, సాధారణ జ్ఞాన, నోట్‌బుక్‌లు, పాఠశాలకు సీపీయూ, ఇతర డిజిటల్ ఉపకరణాలు అందజేశారు. ఎంఈవో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు. కాగా, తాళ్లపల్లి స్కూల్‌లో స్ట్రీట్‌కాజ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్వీయ రక్షణపై ర్యాలీ నిర్వహించి శిక్షణ ఇచ్చారు.



నామినేషన్‌కు డబ్బుల్లేవ్..

మంతన్‌పల్లిలో విచిత్ర ఘటన.. ఏకగ్రీవం కానున్న సర్పంచ్, వార్డు పదవులు

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన భీమప్ప కుటుంబ సభ్యులు

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌడ్ పంచాయతీకి సంబంధించి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఎస్టీ జనరల్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ గ్రామంలో ఒకే ఒక్క ఎస్టీ అయిన భీమప్ప కుటుంబం ఉండటంతో ఆ కుటుంబంలోనే ఒకరికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం కానున్నాయి. ఈ క్రమంలో గురువారం గ్రామంలో విచిత్రమైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువకులు కొందరు భీమప్పతో సమావేశమయ్యారు.


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎరుకల భీమప్ప కుటుంబ సభ్యులు

నామినేషన్ వేయడానికి సర్పంచ్ పదవికి రూ.1,000, వార్డు సభ్యుల పదవులకు రూ.500 చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే నామినేషన్ రుసుం చెల్లింపునకు భీరప్పను డబ్బులు అడుగగా, నా దగ్గర లేవని చెప్పడంతో యువకులంతా ఆశ్చర్యపోయారు. ఏదైనా సరే మీరు చూసుకోండి.. పంచాయతీలో డబ్బులు వచ్చాక మీరే తీసుకోండి అని భీరప్ప చెప్పడం విశేషం. అయితే భీరప్ప కుటుంబ సభ్యులు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి తన కోటా కింద రూ.10 లక్షలు ఇస్తానని ప్రకటించారు.




గోడలపై పెయింటింగ్ వేస్తున్న కళాకారుడు రూపం వెంకట్ రెడ్డి

ఎన్నికళకు పని లేదు

- డిజిటల్ ఫ్లెక్సీల రాకతో కళాకారుల ఇక్కట్లు
- కనుమరుగవుతున్న వాల్ రైటింగ్స్, క్లాత్ బ్యానర్స్

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు వచ్చాయంటే గతంలో చేతినిండా పని దొరికేది. మరో నలుగురు జూనియర్ ఆర్టిస్టులకు పని ఉండేది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు వారి ఎన్నికల గుర్తులను క్లాత్ బ్యానర్లుగా, వాల్ రైటింగ్స్‌గా వేయించేవారు. నేడు మార్కెట్‌లో డిజిటల్ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, స్క్రీన్ ప్రింటింగ్‌లు రావడంతో పని లేకుండా పోతోందని ఆమనగల్లుకు చెందిన కళాకారుడు వెంకట్ రెడ్డి వాపోతున్నాడు. గతంలో ఎన్నికలు వచ్చాయంటే ఒక్కో అభ్యర్థి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు స్థాయిని బట్టి పని దొరికేందని, ప్రస్తుతం కళాకారులకు ఆదరణ కరువైందని వాపోతున్నాడు. రూపం ఆర్టిస్ట్ పేరుతో 35 ఏళ్లుగా ఆమనగల్లులో కొనసాగుతున్నాని, పని లేక కళాకారులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని వాపోతున్నాడు.

ముచ్చటగా మూడుసార్లు

సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

ఆదర్శంగా నిలుస్తున్న మైసిగండి గ్రామం

ఈసారి కూడా అదే దారిలో గ్రామస్తులు

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవాల్లో కడ్తాల మండలం మైసిగండి గ్రామ పంచాయతీ రికార్డులు సృష్టిస్తోంది. వరుసగా మూడు సార్లు సర్పంచ్, మూడు సార్లు ఎంపీటీసీ సభ్యుడిని, మరో రెండు సార్లు సింగిల్ విండో డైరెక్టర్‌ను ఆ గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసారి జనరల్ మహిళకు కేటాయించిన సర్పంచ్ స్థానాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి స్థానికులు చర్చలు జరుపుతున్నారు. గిరిజనులతోపాటు బీసీలు నివాసం ఉన్న ఇక్కడి ప్రజలు రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేస్తూ ఆ తర్వాత అభివృద్ధి విషయంలో విబేధాలకు తావులేకుండా ఐక్యతను చాటుకుంటున్నారు.

మైసిగండి పంచాయతీ వివరాలు	
కుటుంబాలు	612
జనాభా	2850
ఓటర్లు	1800
స్త్రీలు	925
పురుషులు	875
గిరిజనులు	1612
బీసీలు	188

1981లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 45 కిలోమీటర్ల దూరంలో మైసిగండి గ్రామం కడ్తాల పంచాయతీకి




రామావత్ దేశ్యానాయక్, గ్రామ తొలి సర్పంచ్(1981)


కేతావత్ దేవ్‌సింగ్, సర్పంచ్ (1995, 2006)

అనుబంధంగా ఉండేది. 1981లో గాన్గుమర్ల తండా, పెద్దవేములోని బావితండా, చిన్నవేములోని బావి తండా, పుల్లేరు బోడుతండా, పోచమ్మగడ్డ తండా, గడ్డ మీది తండా, ఎలుగు రాళ్ల తండా, కాన్గుబావి తండాలను కలిపి మైసిగండిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2019లో పెద్ద వేములోని బావితండా, గడ్డమీది తండా, గాన్గుమర్ల తండాలు కొత్త పంచాయతీలుగా ఏర్పడడంతో మైసిగండి ఒక్కటే పంచాయతీగా మిగిలింది. 1981 నుంచి 2019 వరకు మైసిగండి పంచాయతీకి ఏడు సార్లు ఎన్నికలు జరిగాయి. 95 శాతం గిరిజనులు ఉన్న ఇక్కడ మూడుసార్లు సర్పంచ్ తోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. 1981లో రామావత్ దేశ్యానాయక్, 1988లో రామావత్ పంతూనాయక్, 1995లో కేతావత్ దేవ్‌సింగ్, 2001లో నేనావత్ బీక్యానాయక్, 2006లో కేతావత్ దేవ్‌సింగ్, 2013లో మాదారం శేఖర్‌గౌడ్, 2019లో రామావత్ తులసీరామ్ సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

ఈసారి కూడా అదే దారిలో..

మైసిగండి సర్పంచ్‌ను ఈసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిజర్వేషన్లలో భాగంగా పంచాయతీ సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. పదవిపై అర డజన్ మంది ఆశలు పెట్టుకున్నారు. స్థానికులతో సమావేశం జరిపి సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేసుకుంటే బాగుంటుందని, గ్రామం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వం ప్రకటించిన రూ.30 లక్షలు ప్రోత్సాహం పొందవచ్చునని స్థానికులకు వారికి నచ్చజెబుతున్నారు.

ఎంపీటీసీ కూడా ఏకగ్రీవమే..

మైసిగండి ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఆదర్శంగానే నిలిచింది. 1995లో తొలిసారిగా ఎంపీటీసీ, ఆమనగల్లు జెడ్పీటీసీగా తండాకు చెందిన పంతూనాయక్ గెలుపొందారు. రెండు పదవులకు గెలుపొందిన ఆయన మైసిగండి ఎంపీటీసీకి రాజీనామా చేయడంతో 1996లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో నేనావత్ బీక్యానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2006 మైసిగండి ఎంపీటీసీ స్థానాన్ని రిజర్వేషన్లలో భాగంగా బీసీలకు కేటాయించారు. దీంతో బీసీ వర్గానికి చెందిన అయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2014లో మళ్లీ జనరల్ కేటాయించడంతో మళ్లీ శ్రీనివాస్ గౌడే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా రెండు సార్లు సింగిల్ విండో డైరెక్టర్‌ను కూడా ఇక్కడి రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆదర్శంగా నిలిచారు. 2019లో ఎంపీటీసీగా గెలుపొందిన దేపావత్ కమ్లీమోత్యానాయక్ నూతనంగా ఏర్పడ్డ కడ్తాల మండలానికి ఎంపీపీగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు వీరే..

1981లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో రామావత్ దేశ్యానాయక్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై అప్పట్లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1995, 2006లో రిజర్వేషన్లలో భాగంగా సర్పంచ్ పదవిని ఎస్టీలకు కేటాయించగా దివంగత కేతావత్ దేవ్‌సింగ్ ఎన్నికయ్యారు. 2006లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం కావడంతో ప్రభుత్వం రూ.5 లక్షలు ప్రోత్సాహకం లభించింది.

ఏకతాటిపైకి పంచాయతీలు!

- ఏకగ్రీవ బాటలో దుగ్గాపూర్, ఆత్కూర్ గ్రామాలు


పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామం

పంచాయతీలు, ఓటర్లు	
గ్రామాలు	38
వార్డులు	308
ఓటర్లు	40,828
మహిళలు	21,024
పురుషులు	19,804

పెద్దేముల్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడ చూసినా ఏకగ్రీవం మాటే వినిపిస్తోంది. ఇనానమస్ అయితే ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు వస్తాయన్న ఆశతో ప్రజలంతా ఏకమవుతున్నారు. మండలంలోని దుగ్గాపూర్, ఆత్కూర్ గ్రామాల్లో సర్పంచ్ పదవిని ఇనానమస్ చేసే ఆలోచనలో ఆయా గ్రామాల ప్రజలు ఒక్కతాటిపైకి వస్తున్నారు. దీనిపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే అభ్యర్థిని ఎంచుకునే విషయంలో సందిగ్ధత నెలకొని ఉంది. ఇప్పటికే ఒకసారి సమావేశం కాగా మరోమారు సమావేశమై అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అభ్యర్థి ఎంపికపై శుక్రవారం సమావేశమవుతున్నట్లు తెలిపారు. దుగ్గాపూర్ గ్రామంలో 515 మంది ఓటర్లు, ఆత్కూర్ గ్రామ పంచాయతీలో 684 మంది ఓటర్లు ఉన్నారు.

టీఈ పోల్ యాప్‌తో ఓటర్ స్లిప్పులు

వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీఈ పోల్ మొబైల్ యాప్ ద్వారా కావాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని పొందవచ్చని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా ఓటరు స్లిప్ పొందవచ్చని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని, అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే కూడా యాప్ ద్వారా తెలియచేయవచ్చని సూచించారు.

బషీరాబాద్‌షాలు

సర్పంచ్ నుంచి శాసన సభ వరకు

ఇద్దరన్నదమ్ముల రాజకీయ ప్రస్థానం

మంత్రిగా ఒకరు, ఎమ్మెల్యేగా మరొకరు

తాండూరు/బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల తొలి అడుగులు సర్పంచ్ పదవి నుంచే మొదలయ్యాయి. వీరిలో ఒకరు మంత్రిగా, మరొకరు ఎమ్మెల్యేగా పదవులు అనుభవించారు. వారే బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన మాజీ మంత్రి స్వర్గీయ ఎం.చంద్రశేఖర్, ఎం.నారాయణరావు. మాజీ మంత్రి స్వర్గీయ చంద్రశేఖర్ రాజకీయ జీవితం బషీరాబాద్ సర్పంచ్ పదవి నుంచే మొదలైంది. 1961లో సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు. 1970 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. అప్పటినుంచి అంచలంచెలుగా ఎదిగి 1992లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా కొనసాగుతున్న సమయంలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆ తర్వాత అదే కుటుంబం నుంచి చంద్రశేఖర్ సోదరుడు నారాయణరావు రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. ఈయన సైతం 1988లో బషీరాబాద్ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1995 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. ఆ తర్వాత 2004 తాండూరు శాసన సభ్యుడిగా గెలుపొందారు.


చంద్రశేఖర్(ఫైల్)


నారాయణరావు

మీ సేవకో దండం!

- ఎన్నికల వేళ మొరాయించిన పోర్టల్
- కుల ధ్రువీకరణ పత్రాల కోసం అభ్యర్థులకు తప్పని పాట్లు

కేశంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మీసేవ పోర్టల్ మొరాయించడంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే రిజర్వుడ్ అభ్యర్థులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) నామినేషన్ పత్రాలతో కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అయితే కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయడానికి గురువారం ఆయా ప్రాంతాల్లోని మీ సేవ కేంద్రాలకు వెళ్తే.. సర్వర్ మొరాయిస్తుందని నిర్వాహకులు తెలుపడంతో ఆందోళనకు గురయ్యారు. గంటల తరబడి వేచి ఉన్నా దరఖాస్తు చేయలేకపోయారు. ఒక దరఖాస్తుకు గంటల సమయం తీసుకుంటుండంతో ఎప్పుడు సర్టిఫికెట్ తీసుకుని, ఎప్పుడు నామినేషన్ వేయాలని అభ్యర్థులు ఆందోళన చెందారు. అధికారులు స్పందించి మీసేవ పోర్టల్‌లో సర్వర్ మొరాయించకుండ చర్యలు తీసుకోవాలని కోరారు.



మీసేవ పోర్టల్‌లో నిలిచిపోయిన సర్వర్


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఊహించుకోలేమని పేర్కొన్నారు. అన్నీ వదులుకొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారు ఎన్నికల్లో పోటీ చేసి, విజయం సాధించేలా అన్ని రాజకీయ పార్టీలు ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో సంక్షేమ సంఘం నాయకులు దొడ్డి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మేకల వెంకటేష్, రవికుమార్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, రాందాస్ పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద

పోలీసు బందోబస్తు

కొడంగల్ రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కొడంగల్ మండలంలో 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి నామినేషన్‌లు వేసేందుకు ఏడు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. రావులపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రావులపల్లి, ఇందనూర్, కస్తూర్‌పల్లి జీపీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల నామినేషన్లకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. అలాగే అంగడిరైచూర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో అంగడిరైచూర్, లక్ష్మీంపల్లి, సంగాయిపల్లి, టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. రుద్రారం కేంద్రంలో రుద్రారం, సాటిమీదిపల్లి, భవనమ్మతండా, బోయపల్లి తండా, హస్నాబాద్‌లో హస్నాబాద్, పెద్దనందిగామ, పర్సాపూర్‌లో పర్సాపూర్, హుస్సేన్‌పూర్, పల్గురాళ్ల తండా, చిట్లపల్లి గ్రామంలో చిట్లపల్లి, ఖాజాహ్మద్‌పల్లి, నాగారం, అన్నారం, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, పోచమ్మతండా, ప్యాలమద్ది, చిన్ననందిగామ జీపీలకు సంబంధించిన అభ్యర్థులు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేయనున్న నేపథ్యంలో అధికారులు ఆయా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కొడంగల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద బందోబస్తులో పోలీసులు


గట్టేపల్లిలో నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

ధాన్యం ఎప్పుడు కొంటారు?

● కొనుగోలు కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

ధారూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ఉన్నా వడ్లు కొనుగోలు చేయడం లేదని గట్టేపల్లి రైతులు తెలిపారు. ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ చేసి పడిగాపులు కాస్తున్నామని గురువారం వారు వాపోయారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం తెరిచి వారం రోజులు గడుస్తున్నా అధికారులు ధాన్యం తూకాలను ప్రారంభించకుండా తాత్సరం చేస్తున్నారని చెప్పారు. వెంటనే కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టోకెన్‌లు రానందునే : కేంద్ర ఇన్‌చార్జి రవికుమార్

ఈ విషయమై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రవికుమార్ స్పందిస్తూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి టోకెన్లు రావటంలో జాప్యం అయినందునే తూకాలు వేయలేదని చెప్పారు. టోకెన్లు వచ్చాయని, 16 మంది రైతులకు గురువారం ఇచ్చామని, శుక్రవారం నుంచి తూకం వేస్తామన్నారు.

తెలంగాణ ఒలింపియాడ్ ఎడ్యుక్వెస్ట్ పోటీలు


ఒలింపియాడ్, ఎడ్యుక్వెస్ట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఒలింపియాడ్ ఎడ్యుక్వెస్ట్ టాక్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఒలింపియాడ్ సీనియర్స్ విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పూడూరుకు చెందిన విద్యార్థిని బి.గీత మొదటి బహుమతి, జూనియర్స్ విభాగంలో రెండో బహుమతి సుమయ్యబేగం సాధించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ మెంటర్‌శివకుమార్, మన్నెగూడ పాఠశాల హెచ్ఎం నర్సింములు,కె.రాజు, షరీఫ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కన్వీనర్ ప్రహ్లద్‌రావు

కులకచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లద్‌రావు అన్నారు. గురువారం కులకచర్లలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ ఆధ్వర్యంలో పరిగి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మారుతి కిరణ్‌బూనెటి, ఎన్నె ఈశ్వరయ్య, వెంకటయ్యగౌడ్, మల్లేశ్, పరమేశ్వర్‌రెడ్డి, జానకిరామ్, సౌమ్యరెడ్డి, రాముయాదవ్, అంజిలయ్య పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'రన్ ఫర్ గ్రీన్ టుమారో'


కార్యక్రమంలో పాల్గొన్న విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను ఆకాంక్షిస్తూ మేడ్చల్‌లోని అత్వెల్లి విజ్ఞాన్ పాఠశాలలో గురువారం రన్‌ఫర్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 600 మంది విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు. ప్రకృతిని పచ్చదనంగా ఉంచేందుకు చేపట్టే చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, మాజీ కౌన్సిలర్ దేవ, హెచ్ఎం ఏవీ. లక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కులకచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముజాహిద్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాలను గురువారం అధికారులు పరిశీలించారు. డిసెంబరు 17న సర్పంచ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపాలన అధికారి నర్సిములు, కార్యదర్శులు సంతోష్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల సీజ్

బొంరాస్‌పేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంకిమెట్ల గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఆర్ఐ శిరీష తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తొలిరోజు మందకొడిగా నామినేషన్లు

● పంచాయతీ ఎన్నికలకు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రక్రియ


తాండూరు రూరల్: చెంగేష్‌పూర్ పంచాయతీలో నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రవీణ్‌గౌడ్

పెద్దేముల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల మొదటి రోజు గురువారం అంతంత మాత్రంగానే నామాంకన పత్రాలు దాఖలు చేశారు. పెద్దేముల్ మండలంలో 38 పంచాయతీలుండగా 18 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కందనెల్లితండా, పెద్దేముల్, నాగులపల్లి పంచాయతీ సర్పంచ్ పదవులకు మూడు చొప్పున.. జయరాంతండా(ఐ),మంబాపూర్, రుద్రారంలలో రెండు చొప్పున నామినేషన్లు వేశారు. కాగా ఓమ్లానాయక్‌తండా, పాషాపూర్, బండమీదిపల్లి, తట్టిపల్లి, ఎర్రగడ్డ తండా, హన్మాపూర్, మన్‌సాన్‌పల్లి, గోపాల్‌పూర్, తింసన్‌పల్లి, కొండాపూర్‌లో, గాజీపూర్, కందనెల్లి గ్రామాల్లో సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలయ్యాయి.

బొంరాస్‌పేట్/దుద్యాల్: బొంరాస్‌పేట్ మండలంలో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. దుద్యాల్ మండలంలోని కుదురుమళ్లలో ఒక్క నామినేషన్ దాఖలైంది.

తాండూరు రూరల్: తాండూరు మండలంలోని 33 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 24, వార్డు పదవులకు 11నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు.

బషీరాబాద్: మండలంలోని 39 పంచాయతీలకు తొలిరోజు సర్పంచ్ పదవులకు 25, వార్డు పదవులకు పది నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సంపత్‌కుమార్ తెలిపారు.

కొడంగల్: మండలంలోని పర్సాపూర్‌లో 4, హస్నాబాద్‌లో 3, సంగాయిపల్లిలో, కస్తూర్‌పల్లి, ఉడిమేశ్వరం2, పోచమ్మ తండాలో రెండు చొప్పున, ఇందనూర్, ప్యాలమద్దిలో సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలయ్యాయి. వార్డు స్థానాలకు 12నామినేషన్లను స్వీకరించారు. దౌల్తాబాద్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 22, వార్డు పదవులకు ఆరు నామినేషన్లు స్వీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.


యాలాల: అన్నసాగర్ సర్పంచ్ పదవికి నామినేషన్‌దాఖలు వేస్తున్న సత్యనారాయణరెడ్డి

యాలాల: మండలంలో గురువారం సర్పంచ్ పదవులకు 29, వార్డు స్థానాలకు 15 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనిజ తెలిపారు. యాలాలలో నామినేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ చంద్రకిరణ్‌లు పరిశీలించారు.


దుద్యాల్: కుదురుమళ్లలో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాంపూర్ లాలప్ప


బషీరాబాద్: దామర్‌చెడ్‌లో మాజీ ఎమ్మెల్యేతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న మహిళ


పెద్దేముల్: మంబాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సాయిని మహదేవి

పార్టీ నుంచి ఒక్కరే పోటీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు పనిచేయాలని తాం డూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంతారం తండా భూకైలాస్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్ పదవికి ఒక్క అభ్యర్థే పోటీ చేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో గ్రూపులుగా విడిపోతే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రా మాల్లో అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. అభ్యర్థుల మధ్య విభేదాలుంటే తన దృష్టికితెస్తే పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు జర్న నాగప్ప, మాజీ ఎంపీపీ శరణబసప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, అవినాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో పట్టెవరిది?

(ఐదోపేజీ తరువాయి)

విజయం సాధించారు. కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లాను తమకు కంచుకోటగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ... పంచాయతీ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువగా పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో .. తమ సత్తా చాటుకునే విధ ంగా పావులు కదుపుతోంది. ఇటీవలనే జిల్లా కాంగ్రెస్ పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించిన విషయం తెలిసిందే. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నా వాటి ద్వారా ప్రజల మద్దతును కూడబెట్టుకోవడంలో అధికార పార్టీ విఫలమవుతో ంది. సంక్షేమ పథకాలను ప్రచారస్త్రాలుగా మార్చుకోవడంలో విఫలమవుతోంది. క్షేత్రస్థాయి లో ఆ పార్టీలో సమన్వయం లేక నేతల మధ్య వివాదాల కారణంగా కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పాగా వేయలేదు. ఈ ఎన్నికల్లో తమ మద్దతుదారులను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవడం ద్వారా పల్లెల్లో పట్టు సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. స్థానిక నాయకత్వానికి పార్టీ అధినాయకత్వం ఇప్పటికే ఆదేశాలిచ్చింది. ప్రతి మండలం లో 95శాతానికిపైగా సర్పంచ్, వార్డు పదవులను కైవసం చేసుకోవాలని ఆదేశించింది.



సత్తా చాటుకునేలా బీజేపీ కసరత్తు

గత లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుకున్న బీజేపీ నాయకులు పంచాయతీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. నాయకత్వ సమస్యను ఎదుర్కొంటున్న బీజేపీకి పంచాయతీ ఎన్నికలు ఓ సవాల్‌గానే మారనున్నాయి. చేవెళ్ల ఎంపీ ముందుండి నడిపించినా... క్షేత్రస్థాయిలో నాయకులు పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలేదనే విమర్శలున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుకుంటేనే ప్రాదేశిక ఎన్నికల్లో తాము గౌరవప్రదమైన స్థానా లు గెలుచుకోగలుతామని ఆ పార్టీ సీనియర్ నాయకులు భావిస్తున్నారు. పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా.. తమ సేవలను సద్వినియో గం చేసుకోవడంలో నాయకగణం విఫలమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు గ్రూపులకు అతీతంగా ఐక్యంగా పని చేస్తేనే తమ మద్దతుదారులను సర్పంచులుగా గెలిపించుకునేందుకు అవకాశముంటుందని బీజేపీ కార్యకర్తలు అంటున్నారు.

ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

(ఐదోపేజీ తరువాయి)


మాట్లాడుతున్న షేక్ యాస్మిన్ బాషా

తెలిపారు. క్లస్టర్ వారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యయ పరిశీలకులు మనోహర రాజు, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, డీఆర్‌వో మంగీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియపై వివరించాలి

నామినేషన్ ప్రక్రియ, అవసరమైన పత్రాల గురించి అభ్యర్థులకు అవగాహన కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు యాస్మిన్‌బాషా సూచించారు. బొంరాస్‌పేట్ మండలంలో వ్యయ పరిశీలకులు మనోహర్‌రాజు, కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధతో కలిసి నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. మనోహర్ రాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. వ్యయ వివరాలు సమర్పించకపోతే గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని అభ్యర్థులకు వివరించాలన్నారు. వారితో తహసీలార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

నవాబుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతిచెందాడు. చించల్‌పేట్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్(35) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఆయన మృతిపట్ల చేవేళ్ల ఎమ్మెల్యే యాదయ్య సంతాపం తెలిపారు.

'బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు ఖాయం'

మర్పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలవడం ఖాయమని బీజేపీ జిల్లా కో-కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మర్పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 29 పంచాయతీలకు బీజేపీ బలపర్చిన అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పోటీ చేసే అభ్యర్థులకు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అండగా ఉంటూ ప్రచారం చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదవ్‌రెడ్డి, శ్రీమంత్‌కుమార్, లక్ష్మణ్, జైపాల్, నరోత్తంరెడ్డి, సురేశ్, సంగమేశ్, బలవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డీఆర్ఎస్'లో ఫ్యాషన్ డిజైన్ ప్రదర్శన



మేడ్చల్ టౌన్, నవం టబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులు ఫ్యాషన్ డిజైన్ స్పెక్టమ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో 11, 12వ తరగతుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫ్యాషియోనీ ఆర్ అనే పేరుతో 70శాతం అసాధారణ వ్యర్థాలు, 30శాతం ఫ్యాబ్రిక్‌తో చేసిన దుస్తులను ప్రదర్శించారు. 12 గ్రేడ్ విద్యార్థులు పురాతన నాగరికతను చాటే దుస్తుల ప్రదర్శన చేశారు. 2016 పూర్వ విద్యార్థిని మేధారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలలో ట్విన్నింగ్ కార్యక్రమం


జెడ్పీ పాఠశాలను సందర్శించిన విద్యార్థులతో టీచర్లు

దౌల్తాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా దౌల్తాబాద్‌లోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులను జిల్లా పరిషత్ పాఠశాలకు తీసుకెళ్లారు. డిజిటల్ స్క్రీన్, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, తరగతి గ దులు, ఆట వస్తువులను చూపించారు. జీహెచ్ఎం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఐదో తరగతి పూర్తయ్యాక డ్రాప్‌అవుట్ అవుతున్నారని, అలా కాకుండా ప్రభుత్వం ట్విన్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు వెంకటయ్య, సాయిలుగౌడ్, శానమ్మ, రేణుక, మొయినుద్దీన్, రమేశ్, వెంకటేశం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

ఘట్‌కేసర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్త బాబురావు మృతి పార్టీకి తీరని లోటని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన ఘట్‌కేసర్ బీఆర్ఎస్ 1వ వార్డుకు చెందిన బాబురావు సంతాప సభను ఎన్ఎఫ్‌సీనగర్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. బాబురావు పార్టీ కోసం కృషిచేశాడని గుర్తు చేశాడు. బాబురావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. బాబురావు పిల్లలకు మల్లారెడ్డి విద్యా సంస్థల్లో ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగరావు, అంజనేయులు, గోపాల్‌రెడ్డి, బిక్షపతి, శ్రీశైలం, రమేష్, చంద్రశేఖర్, లింగస్వామి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న భద్రారెడ్డి

కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు

మేడ్చల్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి చేపట్టిన వజ్రేశ్‌యాదవ్‌ను మేడ్చల్, ఎల్లంపేట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గురువారం మర్యాద పూరకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కార్యకర్తల మద్దతుతో తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మేడ్చల్, ఎల్లంపేట మున్సిపాలిటీల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, సంజీవరావు, వరాదారెడ్డి, సి.రమేష్, పోచయ్య, బి.మధుకర్, నరేందర్ పాల్గొన్నారు.


డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌ను కలిసిన మేడ్చల్ నాయకులు

భద్రేశ్వరుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే


భద్రేశ్వరస్వామిని దర్శించుకుంటున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని భద్రేశ్వర స్వామిని గురువారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం తాండూరులో అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అక్కడ జరిగిన పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీశైల్‌రెడ్డి, యువ నాయకులు రుద్రపటేల్, రవీందర్‌రెడ్డి, వేణుగౌడ్ పాల్గొన్నారు.

సాయిపూర్‌లో కంటి వైద్య శిబిరం


శిబిరంలో ఆర్బీవోఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరు 11వ వార్డులో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వాహించారు. శిబిరాన్ని ఆర్బీకెఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో పాల్గొనేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. పేదల కోసం ఎల్ఎన్ఆర్ యువసేన కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని కొనియడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు బంటు వేణు, నాయకులు పట్లోళ్ల నర్సిములు, లొంక నర్సిములు, బంటు మల్లప్ప, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీ చీఫ్


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్

తాండూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీ చీఫ్‌గా ఎన్నికైన తర్వాత ధారాసింగ్ మొదటిసారి కలిశారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని మహేష్‌గౌడ్.. ధారాసింగ్‌కు సూచించారు.

హోమియోపతి వైద్యురాలిగా మక్తవెంకటాపూర్ వాసి


పట్టాతో సంగీత

చౌడాపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన కాత్రావత్ శంకర్‌నాయక్(సెంట్రింగ్ మేస్త్రీ), వాలీబాయి దంపతుల కూతురు సంగీత బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ సర్జరీలో గ్రాడ్యుయేషన్‌ను ఇటీవలే పూర్తి చేశారు. బెంగళూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో హోమియోపతి కోర్సు పూర్తి చేశారు. మక్తవెంకటాపూర్ వాసి మొదటి హోమియోపతి వైద్యురాలు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కంఠ మహేశ్వరస్వామి ఆలయం కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ ప్రతాప్ సింగారంలో 12ఏళ్ల క్రితం నిర్మించిన కంఠ మహేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గౌడల దైవమైన కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో రోజూ ధూపదీపనైవేద్యంతో పూజలు నిర్వహిస్తున్నారు. కొందరు భూస్వాములు ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆలయాన్ని తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో ఆలయాన్ని కూల్చివేశారు. కొద్దిసేపు జరిగిన వాగ్వాదం అనంతరం ఆలయాన్ని కూల్చేశారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కంఠ మహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమి సర్వే నంబరు 378/71లోని 5 గుంటల భూమిని ఆలయానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, గౌడసంఘం నాయకులు స్వామిగౌడ్, సత్తయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గ్యార జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయకుమార్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం నేషనల్ ఇన్‌స్ట్రుమెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాల్లో ఉన్న పరిజ్ఞానంతో పాటు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. రక్షణ రంగంలో ల్యాబ్ వ్యూ టూల్ ఎలా వినియోగిస్తారో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మ్యూ టెక్నాలజీస్ సీనియర్ ఇంజనీర్ ఉమర్, సమన్వయకర్త మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపుతప్పిన స్కూటర్.. వ్యక్తి మృతి


మల్లేష్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యాక్టీవా స్కూటర్ అదుపుతప్పి పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం రాంపల్లి సుచిత్ర కాలనీలో ఉంటున్న బుక్యా మల్లేష్(34) అన్నోజిగూడలోని హెచ్పీ పెంట్రోల్ బంకులో పనిచేస్తుంటాడు. 26న తన కూతురు నందినిని శంషాబాద్‌లోని హాస్టల్‌లో దింపేందుకు కుషాయిగూడకు చెందిన స్నేహితుడు శ్రీనుతో కలిసి యాక్టీవా(టీజీ08 ఎహెచ్-8310)పై వెళ్లారు. మల్లేష్ కూతుర్ని హాస్టల్‌లో దింపి ఇంటికి వస్తూ యంనంపేట్ సర్వీసురోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి పడిపోయారు. మల్లేష్‌కు తీవ్ర, శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. మల్లేష్‌ను రాంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

యాలాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం యాలాలలో జరిగింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాలాలకు చెందిన గుడిగె బాలకృష్ణయ్య(41) రాధిక భార్యాభర్తలు. బుధవారం రాత్రి వారిమధ్య గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన బాలకిష్టయ్య బయటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వరకు తిరిగి రాలేదు. గ్రామ సమీప వర్దికుంట చెరువు గట్టుపై దుస్తులు, చెప్పులు కన్పించాయి. గ్రామస్తుల సమాచారంతో ఎస్ఐ చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికి తీయించారు. బాలకృష్టయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

లిక్కర్ కేసులో ముగ్గురి అరెస్ట్

తాండూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్‌కుమార్ తెలిపారు. ఎల్మకన్నె, చెంగేష్‌పూర్, గౌతాపూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో చీప్ లిక్కర్ అమ్ముతున్నారనే ఫిర్యాదులతో తనిఖీ నిర్వహించగా ముగ్గురు లిక్కర్ అమ్ముతున్నట్లు తేలిందన్నారు. ఎల్మకన్నెలో కుర్వ మల్లప్ప 7లీటర్లు, చెంగేష్‌పూర్‌లో కుర్వ భీమమ్మ 6 లీటర్లు, గోపన్‌పల్లిలో గుడిసె సుజాత 7లీటర్లు చీప్ లిక్కరు అమ్మినట్టు గుర్తించినట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు.

బాలికను గర్భిణిని చేసిన యువకుడి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను గర్భవతిని చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఓ గ్రామానికి చెందిన యువకుడు(22) మటన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడి దుకాణం ఎదురింట్లో ఉండే బాలిక (17)తో పరిచయం ఏర్పాటు చేసుకొని ప్రేమిస్తున్నాని చెప్పి గర్భిణిని చేశాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.